క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలోని వివిధ కాలనీల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నల్లగొండ ఏడీఈ డి.శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లగూడ, పెద్దబండ, అవుట్ డోర్ స్టేడియం ప్రాంతాల్లో రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఆప్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీను



నకిరేకల్: ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామానికి చెందిన యార శ్రీను నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీను ను ఆప్ రాష్ట్ర ఇన్‌చార్జ్ దొడ్డి సుధాకర్, ఎక్ కన్వీనర్ బుర్ర రాముగౌడ్, కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ అన్సారీ అభినందించారు.

ఎస్ఐ రామకృష్ణకు సన్మానం



ఎస్ఐని సన్మానిస్తున్న నాయకులు

కనగల్: మండల నూతన ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి. రామకృష్ణను కనగల్ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కలిసి పూలబొకేలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాంగిరి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, పార్టీ మండల జనరల్ సెక్రటరీ పాన్నలగడ్డ శేఖర్‌రెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి నర్సిరెడ్డి, వంగాల వెంకట్‌రెడ్డి, దోమలపల్లి యాదగిరి, శంకర్‌నాథ్, నక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి నివాళి

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకుడు బచ్చుపల్లి శ్రీనివాస్‌రావు(52) అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. శ్రీనివాస్‌రావు ఆదివారం మృతి చెందిన విషయం విధితమే. ఆయన కుమారుడు విదేశాల్లో ఉండడంతో ఆయన వచ్చాక అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీనివాస్‌రావు మృతదేహంపై నకిరేకల్ ఎమ్మె ల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ మాజీ ఎ మ్మెల్యే జూలకంటి రంగారెడ్డి,ʻమాజీ ఎంపీపీ చామల శ్రీనివాస్, కందాల ప్రమీల, దైద రవీందర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు రక్తదాన శిబిరం

నల్లగొండ: కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కాన్ఫరెన్స్ హాల్‌ను ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అల్లుడు ప్రణవ్‌రెడ్డి హాజరవుతారని, కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి 'పొన్నం'కు సన్మానం

మునుగోడు: బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మంగళవారం బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్‌గౌడ్ కలిసి శాలువా కప్పి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురైన బీసీలకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి

శాలిగౌరారం: తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడు మృతిచెందాడు. వివరాలు.. శాలిగౌరారం మండలంలోని ఎస్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన బొల్లేపల్లి శంకర్(42) మంగళవారం సాయంత్రం గ్రామ శివారులో కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. అదే సమయంలో అతడికి గుండెపోటు రావడతో కిందపడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రయినా శంకర్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తాటిచెట్ల వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎంజీయూలో విద్యార్థుల నిరసన

నల్లగొండ క్రైం : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సెక్యూరిటీ అధికారిని తప్పించాలని కోరుతూ మంగళవారం వీసీ గోపాల్‌రెడ్డి కార్యాలయం వద్ద విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ సెక్యూరిటీ అధికారి నర్సింహ.. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తక్షణమే అతడిని తప్పించాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని వీసీ హామీ ఇవ్వడంతో విద్యార్థులు నిరసన విరమించారు.

అసంపూర్తిగా అంబేద్కర్ భవనం

- 2019లో పనులకు శంకుస్థాపన
- ప్రభుత్వం నుంచి కోటి రూపాయలు మంజూరు
- నేటికీ పూర్తి కాని పనులు



అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవనం

మునుగోడు: ప్రభుత్వం మూడేళ్ల క్రితం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అన్ని హంగులతో అంబేద్కర్ భవనాలు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అందుకోసం ఒక్కో భవనానికి కోటి రూపాయల చొప్పున నిధులు మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులను అప్పటి ఎమ్మెల్యేలు 2019 అక్టోబర్ మాసంలో శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా మునుగోడులో కూడా అంబేద్కర్ భవనానికి శంకుస్థాన చేశారు. కానీ నేటికి పనులు మాత్రం పూర్తి కాలేదు.

నిరాశకు లోనవుతున్న దళితులు..

మునుగోడు మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ నుంచి 2018 సంవత్సరం సెప్టెంబర్ మాసంలో కోటి రూపాయలు కేటాయించారు. ఆ నిధులతో 3 గుంటల స్థలంలో 79 ఫీట్ల పొడవు, 35 పీట్ల వెడల్పుతో భవన నిర్మాణం చేపట్టేందుకు 2020లో పునాది పనులు ప్రారంభించారు. దాదాపు మూడేళ్లకు పైగా పనులు కొనసాగుతున్నా నేటికీ భవన నిర్మాణం పూర్తిచేయకపోవడంతో మండలంలోని దళితులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. భవన నిర్మాణ పనులు పూర్తయితే దళిత కుటుంబాలకు చెందినవారు సభలు, సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు ఏదైనా శుభ కార్యాలయాలు చేసుకునేందుకు ఉపయోగపడేది. కానీ అధికారుల నిర్లక్ష్యమో, కాంట్రాక్టర్ అలసత్వమో అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని అంబేద్కర్ భవన నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రభుత్వ లక్ష్యం నెరవేరాల చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిధులు సరిపోవడం లేదు

అంబేద్కర్ భవన నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సరిపోవడం లేదు. ఇంకా లోపలి భాగంలో ప్లాస్టింగ్, బండలతోపాటు విద్యుత్ వైర్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. నిధులు ఉన్నంత వరకు పనులు పూర్తి చేశాం. ప్రభుత్వం మిగిలిన పనులకు నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తాం.

–రమేష్, పంచాయతీరాజ్ ఏఈ

భవన నిర్మాణం పూర్తి చేయాలి



నియోజకవర్గంలో కోటి రూపాయలతో అంబేద్కర్ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులు 2019 అక్టోబర్ మాసంలో ప్రారంభించారు. కానీ నేటికీ పనులు పూర్తి చేయలేదు. నిర్మాణం పూర్తయితే దానిలో సభలు, సమావేశాలతోపాటు శుభ కార్యాలయాలకు వినియోగించుకునేవాళ్లం. దళితులందరికీ సంతోషంగా ఉండేది. ఇప్పటికయినా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భవన నిర్మాణం పూర్తి చేయించాలి.

–దుబ్బ రాజు, మునుగోడు మండలం

భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తాం



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అర్చకులు, సిబ్బంది



మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు, సిబ్బంది

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయ అధికారులు, అర్చకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి, ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని వారిని సన్మానించి శివయ్య ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల సమస్యలు, అభివృద్ధి వివరాలను మంత్రి, ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. త్వరలో ఆలయానికి విచ్చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమలలో ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, సురేష్‌శర్మ, రాంబాబు, మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, మాజీ చైర్మన్లు పున్నపురాజు యాదగిరి, రేగట్టె రాజశేఖర్‌రెడ్డి, బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, వరాల రమేష్, గాడుసు శశిధర్‌రెడ్డి, రేగట్టె నవీన్ రెడ్డి, మల్లేశం, యానాల రాంరెడ్డి, శివ పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవి

నల్లగొండ: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నల్లగొండలోని రామగిరి రామాలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని నల్లగొండ ఆర్డీఓ రవి సూచించారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో పోలీస్, మున్సిపల్, విద్యుత్, ఫైర్ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి నాడు తెల్లవారుజామునుంచే స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ప్రశాంతంగా దైవ దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధనుర్మాస ఉత్సవాల ముగింపు రోజు గోదాదేవి రంగమన్నార్ కల్యాణానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం

నూతన పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఓటరు నమోదుతోపాటు మార్పులు, చేర్పులపై ఆర్డీఓ రవి మంగళవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆర్డీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ నియోజకవర్గ పరిధిలో మూడు పోలింగ్ బూత్‌లను పెంచాలని నిర్ణయించామని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి గుమ్ముల మోహన్‌రెడ్డి, సీపీఎం ప్రతినిధి పుచ్చకాయల నర్సిరెడ్డి, బీజేపీ ప్రతినిధి లింగస్వామి, వివిధ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పాస్టర్లతో ..

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని నల్లగొండ డివిజన్ పరిధిలోని పాస్టర్లతో మంగళవారం ఆర్డీఓ రవి సమావేశం నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా ప్రభుత్వం అందించే దుస్తుల పంపిణీ, పండుగ రోజు నిర్వహించే కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, పాస్టర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి చేయూత



దుప్పట్లు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మర్రిగూడ: మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన మేరె రాధమ్మ అనే మతిస్థిమితం లేని వృద్ధురాలికి ఆదరణ ఫౌండేషన్ అధ్యక్షుడు కలకొండ నర్సింహ మంగళవారం దుప్పట్లు, చీరలు, పండ్లు, ఆహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్సహాయ స్థితిలో ఉండేవారికి ఆదరణ ఫౌండేషన్ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ముళ్ల రవికుమార్, చిట్యాల యాదగిరిరెడ్డి, ముళ్ల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



ఎమ్మెల్యే వీరేశాన్ని సన్మానిస్తున్న నాయకులు

చిట్యాల: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం తాళ్లవెల్లెంల గ్రామ మాజీ సర్పంచ్ వడ్డెపల్లి శ్రీశైలం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో తన విజయానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు. తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లవెల్లెంల గ్రామ ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య, వెంబాయి గ్రామ సర్పంచ్ అద్దెల నర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పున్న కైలాస్‌నేత, అద్దెల లింగారెడ్డి, బత్తుల వెంకన్న, చంద్రమౌళి, అద్దెల సుధీర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

చిట్యాల మండలానికి చెందిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కలిసి సత్కరించారు. ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి శంకర్ మాదిగ, ఎమ్మార్పీస్ నాయకులు ఎరసాని గోపాల్, పెరిగ లింగస్వామి, నోముల పురుషోత్తం, బుస్సు శంకర్ తదితరులున్నారు.

ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింహ

మునుగోడు: విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు జారీచేసినా వెంటనే అమలు చేయాలని ఎంఈఓ కె. నర్సింహ సూచించారు. మంగళవారం మునుగోడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. ఏకీకృత సమాచార వ్యవస్థను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రధానంగా విద్యార్థులకు పాఠశాలల్లో కల్పించాల్సిన సౌకర్యాలతోపాటు ఉపాధ్యాయుల వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఎండీ రఫీ, మల్లేషం, ఎస్. యాదయ్య, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కులాల అంతరాలు తొలగిపోవాలి



మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

నల్లగొండ టౌన్: సమాజంలో కులాల అంతరాలు తొలగిపోవాల్సిన అవసరం ఉందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. మంగళవారం స్థానికంగా సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 3న సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా అన్ని గ్రామాల్లో జయంతి ఉత్సవాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పరుశరాములు, జిల్లా నగేష్, బొట్టు శివకుమార్, విజయ్‌కుమార్, బొల్లు రవీందర్, ఒంటెపాక కృష్ణ, దండు రవి, రాజు, అంజిబాబు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేయాలి

చిట్యాల: నల్లగొండ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వ సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. చిట్యాలలో మంగళవారం జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహిందని ఆరోపించారు. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని, భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఎండీ.అక్బర్, గీతాపనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులుగౌడ్, పార్టీ మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, మండల కౌన్సిల్ సభ్యులు బొల్గూరి లింగయ్య, మేకల భిక్షం, చినవెంకన్న, దామనూరి అంజయ్య పాల్గొన్నారు.

పంచాయతీలకే పరిమితమా!

- ఎన్నికల కోడ్ కారణంగా గతంలో బతుకమ్మ చీరల పంపిణీ నిలిపివేత
- లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు



మర్రిగూడ గ్రామపంచాయతీలో నిల్వ ఉన్న బతుకమ్మ చీరలు

మర్రిగూడ: గత ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా 18 ఏళ్లు నిండి రేషన్ కార్డులో పేరున్న ప్రతి మహిళకు బతుకమ్మ చీర కానుకగా అందిస్తూ వచ్చింది. ఈ ఏడాది చీరల పంపిణీ ప్రారంభించిన నాలుగైదు రోజుల్లోనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో చీరల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిలిపివేశారు. బతుకమ్మ చీరలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోను ఉంచారు. లబ్ధిదారులు నిత్యం గ్రామపంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదని, అందిన వెంటనే పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

గ్రామాల వారీగా ఇలా..

మర్రిగూడ 1021 చీరలు మంజూరు కాగా 360 పంపిణీ చేయాల్సి ఉంది. అజ్జిలాపురం 414కుగాను 56, రాజాపేటతండా 230కుగాను 10, దామెర భీమనపల్లి 829కిగాను 300, లెంకలపల్లి 656కు గాను 340, యరగండ్లపల్లిలో 423కుగాను 14, వెంకేపల్లి 292కుగాను 86, కొట్టాల 241కుగాను 90, కుదభాక్షపల్లి 1060కుగాను 420, వట్టిపల్లి 539కు గాను 208, కమ్మగూడకు 468కుగాను 0, తమ్మడపల్లి 330కుగాను 49, రాంరెడ్డిపల్లి 850కుగాను 20, కొండూరు 398కుగాను 30, తిరగండ్లపల్లి 469కు గాను 41, సరంపేట 448కుగాను 91, శివన్నగూడ 1132కుగాను 602, మేటిచందాపురం 289కుగాను 82, నామాపురం 483కుగాను 240, అంతంపేట 869కి గాను 300 చీరలు పంపిణీ చేయాల్సి ఉంది. మొత్తం 11,831 చీరలు మంజూరు కాగా 8492 చీరలు పంపిణీ చేశారు. మిగతా 3,339 చీరలు పంపిణీ చేయాల్సి ఉంది.

రేషన్‌కార్డులో పేరుంటేనే చీరల పంపిణీ

రేషన్‌కార్డులో 18 ఏళ్లు నిండిన మహిళ పేరు ఉంటేనే బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నారు. అయితే రేషన్ కార్డుల్లో పేరు తొలగించే అవకాశం ఉంది కానీ చేర్చే అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు మహిళలు వాపోతున్నారు.

నాలుగు రోజులు పంచి నిలిపివేశారు

బతుకమ్మ చీరలను మా గ్రామంలో నాలుగు రోజులు పంపిణీ చేసి ఎన్నికలు ఉన్నాయని నిలిపివేశారు. ఎన్నికలు పూర్తయినప్పటికీ పంపిణీ చేయడం లేదు. అధికారులు చొరవ తీసుకొని చీరల పంపిణీ పూర్తి చేయాలి.

–యాదమ్మ, కుదాబాక్షపల్లి

అర్హులందరికీ ఇవ్వాలి

పంపిణీకి వచ్చిన బతుకమ్మ చీరలు గ్రామపంచాయతీల్లో ఉంటే ప్రయోజనం ఏంటి. అర్హులందరికీ చీరలు ఇస్తే బాగుంటుంది. ఆ చీరలను రిటర్న్ చేస్తే ఎవరికి లాభం. సంప్రదాయానికి ప్రతీకగా ఉన్న బతుకమ్మ చీరలను అర్హులందరికీ పంపిణీ చేయాలి.

–అలివేలు, శివన్నగూడ

ఎలాంటి ఆదేశాలు అందలేదు

ఎన్నికల ముందు చీరల పంపిణీ ప్రారంభించినప్పటికీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిలిపివేశాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందితే చీరల పంపిణీ పునః ప్రారంభిస్తాం. అర్హులైన లబ్ధిదారులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు.

–సయ్యద్ యాకుబ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కేతేపల్లి: వరినారు సాగులో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టి తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం సూచించారు. మంగళవారం మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో వరినారు మడులను సందర్శించి వరినారు సంరక్షణపై రైతులకు పలు సూచనలు చేశారు. యాసంగి సీజన్‌లో చలి తీవ్రత వల్ల నారు ఎదగక పోవడం, ఆకులు ఎరుపు, పసుపు రంగులోకి మారి చనిపోవడం జరుగుతుందన్నారు. చలి బారి నుంచి వరినారు సంరక్షణ కోసం సాయంత్రం వేళలో నారుమడిలో నీరు తీసివేసి పగటిపూట వెచ్చని నీటిని పెట్టాలని సూచించారు. జింక్‌లోపం వల్ల ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడతాయని, దీని నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. నారు ఆరోగ్యంగా పెరిగేందుకు కిలో యూరియాకు 2 గ్రాముల కార్బండాజిమ్, మాంకోజెబ్ మిశ్రమ మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఓ వెంట రైతులు మల్సూరు, నర్సయ్య, మహేష్, శ్రీను తదితరులు ఉన్నారు.

మొక్కులు చెల్లించుకున్న జగదీష్‌రెడ్డి దంపతులు

నకిరేకల్ : సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి దంపతులు నకిరేకల్ మండలం పాలెం గ్రామంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతిసారి ఎన్నికల నామినేషన్ వేసేముందు ఈ ఆలయానికి కుటుంబసమేతంగా వచ్చి ముడుపులు కట్టి వెళ్లేవారు. ఎమ్మెల్యేగా గెలవడంతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన జగదీష్‌రెడ్డికి వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప స్వామి విగ్రహానికి అభిషేకం చేస్తున్న మాలధారులు, గురుస్వాములు

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఐతగోని సైదులుగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. మేళతాళాల మధ్య అయ్యప్ప భజనలతో అయ్యప్ప ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో గురుస్వాములు శ్యామ్, కలిశాన్ అశోక్, విశ్వప్రసాద్, కంజర శ్రీను, ఐతగోని శ్రీను, పుట్ట వెంకన్న, సంధ్య, వైష్ణవి, లోహిత, ధనుష్, ఆంజనేయులు, బూరుగు సైదులు, మాధవి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేయాలి

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరేందుకు నెమలికాల్వ ఆనకట్ట నుంచి మూసీ నదిలోకి నీటిని విడుదల చేయాలని రామగిరి సర్పంచ్ బండారు శంకర్ నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. మూసీనదిపై వలిగొండ మండలం నెమలికాల్వ వద్ద ఉన్న ఆనకట్టను నీరు పారుదల శాఖ ఏఈ రాములుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నెమలికాల్వ ఆనకట్ట నుంచి ఆసీఫ్‌నహర్ కాలువకు అధికంగా నీటి విడుదల కావడంతో ప్రాజెక్టులోకి నీరు రావడంలేదన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చేలా చూడాలని కోరారు. స్పందించిన అధికారులు నెమలికాల్వ ఆనకట్ట నుంచి మూసీ నదిలోకి నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు.

ఆర్థికసాయం అందజేత

మర్రిగూడ: మండలంలోని రాంరెడ్డిపల్లి పరిధిలోగల తానేదారుపల్లి గ్రామానికి చెందిన యోన ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పగడాల కనకయ్య మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట తుప్పరి రఘు తదితరులు ఉన్నారు.

నేడు యూటీఎఫ్ మహాసభలు

మర్రిగూడ: మండల కేంద్రంలోని ఎంజేఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం టీఎస్ యూటీఎఫ్ మండల మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.కృష్ణారెడ్డి తెలిపారు. సంఘం నాయకులు సకాలంలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

నల్లగొండ టౌన్: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ మభ్యపెడుతూ మోసం చేస్తోందని విమర్శించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పెరిక కరణ్‌జయరాజ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వడ్డెబోయిన సైదులు, సింగం శ్రీకాంత్, పుల్లెంల సతీష్, రమేష్, పెరుమాళ్ల వేణు, కొండేటి మహేష్, చినగోపి, కొండ మహేష్ పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

నార్కట్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణ వెల్లంల గ్రామానికి చెందిన రేణుకకు మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బంది సమాచారం ఇచ్చారు. మునుగోడుకు చెందిన 108 వాహంన గ్రామానికి చేరుకుని రేణుకను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించింది. తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నట్లు 108 సిబ్బంది డాక్టర్ గంగాధర్, రమేష్, మునీర్ తెలిపారు.



అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి : మండలంలోని మాండ్ర గ్రామ శివారులో గల స్వర్ణగిరి శ్రీ పట్టాభిరామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉత్తరపల్లి నరసింహాచార్యులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు ఉండ్రా లింగారెడ్డిభాగ్యమ్మ, సర్పంచ్ సౌమ్యరమేష్, గుండు నరసింహ, గురుజ రాములు తదితరులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామ పంచాయతీ పరిధి శ్రీశైలంనగర్‌లో మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైంది. బాధితుడు కొమ్మనబోయిన చినభిక్షం తెలిపిన వివరాల ప్రకారం.. చినభిక్షం మంగళవారం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. రూ.50 వేల నగదు, మూడు తులాల బంగారం, వస్తు సామగ్రి, భూమి పట్టాదారు పాసుపుస్తకాలు, రేషన్ కార్డు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చినభిక్షం తెలిపారు.